రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



## వెల్‌జర్లలో ఘనంగా విత్తన మేళా

**షాద్‌నగర్, జులై 27, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వెల్‌జర్ల గ్రామ రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు అందుబాటులో ఉన్న వివిధ రకాల విత్తనాలను పరిశీలించి, వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయ శాఖ అధికారులు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ సేవలు, సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యమైన విత్తనాలపై అవగాహన కల్పించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు కృషి చేయాలని అన్నారు. వ్యవసాయ అధికారి సుజాత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేష్ గౌడ్, వెంకట్ రెడ్డి, భరత్ లహోటి, సర్పంచ్ రాత్లావత్ బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



విత్తన స్టాళ్లను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

**కొడంగల్, జులై 27ప్రభాతవార్త:** కొడంగల్ పట్టణ శివారులోని కోస్గీ రోడ్డులోని భారత్ పెట్రోల్‌పంప్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కాగా అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.



# కొరతను ఆసరా చేసుకుని టోకరా!

- మంచన్‌పల్లిలో నకిలీ ఎరువుల కలకలం
- తక్కువ ధర ఆశ చూపి రైతుల నోట్లో మట్టి
- డ్యాప్ అని నమ్మించి రూ. 1,700లకే విక్రయం
- పొలాల్లో కరగని చవక ఎరువు!
- రైతుల చేతులకు బొబ్బలు
- బాధితుల ఫిర్యాదుతో 126 బస్తాలు సీజ్

**పూడూరు, జులై 27, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పరిధిలోని మంచన్ పల్లి, సోమన్ గుర్తి తదితర గ్రామాల్లో నకిలీ డ్యాప్ ఎరువుల విక్రయం తీవ్ర కలకలం రేపింది. మార్కెట్లో బస్తా డ్యాప్ ధర రూ. 1,350 వరకు ఉండగా, సరియైన సమయానికి ఎరువులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతు లు ప్రైవేటుగా రూ. 2 వేల వరకు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న ఒక వ్యక్తి, రవాణా సౌకర్యంతో కలిపి ఒక బస్తా డ్యాప్‌ను రూ. 1,700లకే ఇస్తామని నమ్మబలికాడు. దీంతో తక్కువ ధరకే వస్తోందని భావించిన రైతులు వందలాది బస్తాల ఎరువులను కొనుగోలు చేశారు. అయితే, వర్షాలు పడిన తర్వాత పొలాల్లో ఈ ఎరువును వేసేందుకు వెళ్లిన రైతులకు చేతులకు బొబ్బలు రావడం, వర్షాలు కురిసిన నాలుగు రోజులైనా వేసిన ఎరువు కరగకపోవడంతో రైతుల్లో అనుమానం వ్యక్తమైంది. ఈ విషయమై ఎరువులు విక్రయించిన మధ్యవర్తిని నిలదీయగా సరియైన సమాధానం చెప్పకపోవడం, కొందరికి డబ్బులు చెల్లించి మరికొందరికి ఇవ్వకపోవడంతో తాము కొనుగోలు చేసింది నకిలీ ఎరువులుగా భావించిన రైతులు వ్యవసాయ అధికారులను ఆశ్రయించి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై మండల వ్యవసాయ అధికారిణి లావణ్య స్పందిస్తూ... మంచన్‌పల్లి గ్రామంలో 120 బస్తాలు, సోమన్ గుర్తి గ్రామంలో ఆరు బస్తాల డ్యాప్ ఎరువులను సీజ్ చేసి పోలీస్ కస్టడీలో ఉంచామని తెలిపారు. రైతుల ఫిర్యాదు మేరకు విజిల్స్ అధికారులతో కలిసి గ్రామాలను సందర్శించి పరిశీలించినట్లు వెల్లడించారు. పరిగి మండలం బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ అజీమ్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా ఈ ఎరువులను విక్రయించినట్లు గుర్తించామని పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న ఎరువుల నమూనాలను పరీక్షల కోసం ఫోరెన్సిక్ / ఫెర్టిలైజర్ ల్యాబ్‌కు పంపిస్తున్నామని, నకిలీవని తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో డిఎఓ కవిత, ఎడిఎ సందీప్, ఎఇఓలు పాల్గొన్నారు.



పూడూరు మండలం మంచన్‌పల్లి గ్రామంలో డిఎపి ఎరువులను తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

# పరిహారం తర్వాతే పనులు



రోడ్ల విస్తరణ పనులను పరిశీలిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

- కొంపల్లి-గండిమైసమ్మ రోడ్డు అభివృద్ధిపై మంత్రి శ్రీధర్ బాబు ఫోకస్..
- ఆగస్టు 15 కల్లా పోల్స్ షిఫ్టింగ్
- సెప్టెంబర్ చివరినాటికి రోడ్డు పూర్తి కావాలని ఆదేశం
- కుత్బుల్లాపూర్ ట్రాఫిక్ కష్టాలకు చెక్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై27,ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వాసుల దశాబ్దాల ట్రాఫిక్ కల నెరవేరబోతోంది. ఎన్నో ఏళ్లుగా నానబెడుతున్న కొంపల్లి-బహదూర్‌పల్లి, మియాపూర్-గండిమైసమ్మ రోడ్ల విస్తరణ పనులను ముమ్మరం చేసిన ప్రభుత్వం.. ఈ సెప్టెంబర్ ఆఖరు నాటికల్లా ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డెడ్‌లైన్ విధించింది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం క్షేత్రస్థాయిలో పనులను క్షుణ్ణంగా పరిశీలించి, అధికారులకు ఉరకలు పెట్టించే దిశగా కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మంత్రికి స్వాగతం పలకగా.. విద్యుత్, అటవీ, పోలీస్ శాఖల ఉన్నతాధికారులతో కలిసి మంత్రి సుదీర్ఘంగా సమీక్షి ంచారు.

పనుల ప్రక్రియలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు మొదట నష్టపరిహారం చెల్లించిన తర్వాతే ముందుకు వెళ్లాలని సైబరాబాదు కమిషనర్ సృజనకు మంత్రి స్పష్టం చేశారు. దూలపల్లి, బహదూర్పల్లి గ్రామాల్లో భూసేకరణ ప్రక్రియను ప్రాధాన్యత క్రమంలో వేగవంతం చేయాలని కొంపల్లి, దుండిగల్ డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. అటవీ అనుమతులను వేగవంతం చేస్తూనే, అటవీ ప్రాంతంలో ఉన్న కరెంట్ పోల్స్‌ను ఆగస్టు 15వ తేదీలోగా పూర్తిస్థాయిలో తొలగించాలని అధికారులకు గడువు నిర్దేశించారు.

ఈ షిఫ్టింగ్ పూర్తయిన వెంటనే మిగిలిన రోడ్డు నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి సెప్టెంబర్ నెలాఖరుకల్లా సకల సౌకర్యాలతో రోడ్డును సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రాజెక్టు పరిధిలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా తుఫాను నీటి కాలువ అలైన్మెంట్ డీటైల్డ్ రిపోర్టును వెంటనే దిలీది కమిషనర్‌కు సమర్పించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకెష్ కుమార్, డిసిలు, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇంజనీర్లు, అటవీ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎసిబికి పట్టుబడిన కార్యదర్శి జగదీష్

## కల్యాణ లక్ష్మిలోనూ కక్కుర్తి!

### పంచనామాకు రూ.6వేలు డిమాండ్ ఏసీబీకి చిక్కిన జీపీఓ

**పరిగి, జులై 27 ప్రభాతవార్త :** రెండు వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ జీపీవోవికారాబాద్ జిల్లా, దోమ మండలం, మోత్కూర్ గ్రామంలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ అధికారి (జీపీఓ) జగదీష్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హాండెడ్‌గా పట్టుబడ్డారు.

మోత్కూర్ గ్రామానికి చెందిన ఎడ్ల ఎల్లమ్మ తన కూతురి పెళ్లి తర్వాత కల్యాణ లక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు ప్రక్రియ ముందడుగు పడటానికి, పంచనామా కోసం జీపీఓ జగదీష్ మొత్తం రూ. 6,000 డిమాండ్ చేశారు. సోమవారం తన కార్యాలయంలో మొదటి విడతగా రూ. 2,000 తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు అతడిని పట్టుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్ ఈ వివరాలను వెల్లడిస్తూ, సదరు జీపీఓపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## చిలుకవాగుకు మరో రూ.30కోట్లు

**తాండూరు, జులై 27, ప్రభాతవార్త :** తాండూరు మున్సిపల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న చిలుక వాగు ప్రాజెక్టుకు అదనంగా రూ.30కోట్లు నిధులను ప్రభుత్వం ఆర్థిక అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక జీఓను విడుదల చేసింది. అదనపు నిధుల కోసం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఇటీవల ఉప ముఖ్యమంత్రి, భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేయగా.. సానుకూలంగా ప్రభుత్వం స్పందిస్తూ.. ఆర్థిక అనుమతులు జారీ చేసింది.

## సైబర్ నేరాలపై మరింత నిఘా

### ఐజి షానవాజ్ ఖాసిం ఆదేశం

**పరిగి, జులై 27, ప్రభాతవార్త :** ప్రజలకు న్యాయం జరిగేలా,వారి విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతీ పోలీస్ అధికారి వ్యవహరించాలని మల్టి జోన్2 ఐజిపి షానవాజ్ ఖాసిం తెలిపారు. వార్షిక తనిఖీలలో భాగంగా సోమవారం మల్టీ జోన్-ıı ఐజీపీ షహనవాజ్ ఖాసీం, ఐ.పి.ఎస్ పరిగి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు.. రికార్డులు, సిబ్బంది పనితీరు, పెండింగ్ కేసుల పురోగతి వంటి అంశాలపై ఆరా తీసారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవలు అందించాలని అధికారులకు సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన ఐజీపీ వికారాబాద్ రక్షణ నేత్రం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరును గమనించారు.., ప్రత్యక్ష పర్యవేక్షణ వ్యవస్థ, నేరాల నియంత్రణలో వాటి వినియోగం పెంచాలని సూచించారు...సైబర్ నేరాల నియంత్రణపై నిఘా పెంచి, ప్రత్యేక దృష్టి సారించాలని,సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా ఐపిఎస్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, పరిగి సీఐ కొండల్ రెడ్డి,పరిగి ఎస్ఐ మోహన కృష్ణ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఐజికి జ్ఞాపికను అందజేస్తున్న ఎస్పీ

## చివరి రోజు వరకు ఆగద్దు

### ఓటరు నమోదుపై కలెక్టర్ అలర్ట్

**రంగారెడ్డిఅర్బన్, జులై 27 ప్రభాతవార్త:** ప్రతి అరత్త ఓటరు ఆగస్టు 3లోగా తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలని కలెక్టర్ నారాయణరెడ్డి కోరారు. చివరి రోజు వరకు వేచి ఉండకుండా వెంటనే బీఎల్‌వోను సంప్రదించి ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటిలోని అర్హులందరూ ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించారో లేదో కుటుంబ సభ్యులు నిర్ధారించుకోవాలన్నారు.జిల్లాలో శించిన స్థాయిలో పురోగతి లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు.

## పరిశ్రమలకు అన్ని రకాలుగా క్లియరెన్స్

### అధికారులకు సిఎస్ సంజయ్ జాజు ఆదేశం

**రంగారెడ్డి జిల్లాప్రతినిధి, జులై 27,ప్రభాతవార్త:** మహేశ్వరం ఈసిటీ, మంఖాల్ పారిశ్రామిక పార్క్, మహేశ్వరం జనరల్ పార్క్‌లలోని పలు ప్రముఖ పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం సందర్శించారు. ఉత్పత్తి ప్రక్రియ, పెట్టుబడులు, ఉపాధి కల్పన, విస్తరణ ప్రణాళికలను పరిశీలించారు. ముందుగా ఈసిటీలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ప్రీమియర్ ఎనర్జీస్ ఫోటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. రూ.1,240 కోట్ల పెట్టుబడితో స్థాపించబడిన ప్రీమియర్ ఎనర్జీస్ ఫోటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్, రూ.59.22 కోట్ల మూలధనంతో ఉన్న అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమలను సందర్శించారు. హైటెక్ రక్షణ ఎలక్ట్రానిక్స్, శాటిలైట్ పేలోడ్ వ్యవస్థలు,గ్రౌండ్ స్టేషన్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది. మంఖాల్ పారిశ్రామిక పార్క్‌లోని చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ పరిశ్రమను పరిశీలించారు. సుమారు 29.87 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో బీఓపీపీ, బీఓపీఈటీ ఫిల్మ్ తయారీతో పాటు కోటింగ్, మెటలైజింగ్, స్లిట్టింగ్, రీసైక్లింగ్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. రూ.284.02 కోట్ల పెట్టుబడితో వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తున్న ఈ సంస్థలో 500 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. అనంతరం మహేశ్వరం జనరల్ పార్క్‌లోని విప్రో ఎంటర్‌ప్రైజెస్ (ప్రైవేట్) లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్.. పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులు, ప్రభుత్వ అనుమతులు, సేవల అందింపులో అధికారులు మరింత సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరిశ్రమలకు అనుకూల వాతావరణాన్ని మరింత బలోపేతం చేయటానికి అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.



మహేశ్వరం ఈసిటీలో పరిశ్రమలను పరిశీలిస్తున్న సిఎస్ సంజయ్ జాజు

## ఉన్నత స్థాయిలో ఉత్తమ ర్యాంకులే లక్ష్యం కావాలి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జులై 27,ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ఐఐటీ, నీట్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. సోమవారం మహేశ్వరం మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. బోధన విధానం, తరగతుల నిర్వహణ, ఉపాధ్యాయుల బోధనపై విద్యార్థులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.



తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులతో ముచ్చటిస్తున్న సిఎస్

# ఎంతో నమ్మకంతో వస్తున్నారు

### దరఖాస్తులను తిరస్కరిస్తే తగిన కారణం చెప్పండి
### మేడ్చల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 27, ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు ఎలాంటి జాప్యం లేకుండా సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుంచి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ... ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చి తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు కలెక్టరేట్‌కు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన పూర్తి బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఒకవేళ ఏదైనా కారణంతో దరఖాస్తులను తిరస్కరిస్తే, తిరస్కరణకు గల స్పష్టమైన కారణాలను అర్జీదారులకు వివరంగా తెలియజేయాలని సూచించారు. అంతేకాకుండా, స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 106 అర్జీలు నమోదయ్యాయి. ఇందులో అత్యధికంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ విభాగంలో 39 అర్జీలు రాగా, గృహ నిర్మాణ విభాగంలో 11, అర్బన్ ల్యాండ్ సీలింగ్ మరియు జిల్లా విద్యాశాఖ విభాగానికి చెరో 8, డి విభాగానికి 7, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ మరియు ఇ విభాగానికి చెరో 5 దరఖాస్తులు వచ్చాయి.



మేడ్చల్‌లో వికలాంగురాలి సమస్య తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ ఫైజాన్

## ప్రతి దశలోనూ కీలక చొరవ

**వికారాబాద్, ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఇ.వెంకటచారి, ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్, డీఆర్ఓ స్వర్ణలత, డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) పూజ, జడ్పీ సీఈఓ సుధీర్, లతో కలిసి ప్రజల నుండి 165 ప్రజా ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట స్థాయిలో సిఎం ప్రజావాణికి వచ్చిన ప్రజావాణి ఫిర్యాదుల రిపోర్ట్ ను జిల్లా కు పంపించారని, జిల్లాకు సంబంధించి వచ్చిన దరకాస్తులను జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తు లను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి మండల స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వచ్చిన ఫిర్యాదును ఎవరి స్థాయిలో వారు పరిశీలించి పూర్తి చేయాలనీ ఆయన అన్నారు.



వికారాబాద్ కలెక్టర్‌కు గోడు చెప్పుకుంటున్న వృద్ధురాలు

## బాధ్యతాయుతంగా మెలగండి

**రంగారెడ్డిఅర్బన్,జులై 27,ప్రభాతవార్త:** ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఈ వారం మొత్తం 136 ఫిర్యాదులు అందాయి. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముఖ్యమైన వేదిక అని అన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో సమర్పిస్తున్న ప్రతి అర్జీపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వినతులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్ణీత గడువులోగా పరిష్కరించి ఫిర్యాదుదారులకు సమాచారం అందించాలని సూచించారు.అధికారులు ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీపై సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ వారపు ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 54 ఫిర్యాదులు, ఇతర శాఖలకు చెందిన 82 ఫిర్యాదులు అందగా, మొత్తం 136 దరఖాస్తులు నమోదు అయ్యాయి. భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, పింఛన్లు, తాగునీరు, రహదారులు, విద్యుత్, ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన వినతులు అధికంగా వచ్చినట్లు అధికారులు తెలిపారు.



రంగారెడ్డిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

**మండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి కుటుంబానికి పరామర్శలు**

**చేవెళ్ల, జులై 27, ప్రభాతవార్త :**ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి తల్లి పట్నం రుక్కమ్మ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో చేవెళ్ల కాంగ్రెస్ నాయకులు సోమవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. షాబాద్ లోని వారి నివాసంలో ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, షాబాద్ మాజీ జడ్పిటిసి సభ్యులు పట్నం అవినాష్ రెడ్డిలతో కలిసి దివంగత పట్నం రుక్కమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్నం కుటుంబ సభ్యులను కలిసిన వారిలో చేవెళ్ల పీఏసీఎస్ ఛైర్మన్ దేవర వెంకటరెడ్డి, బందారు ఆగిరెడ్డి, కౌన్సిలర్ లు మద్దెల శ్రీనివాస్, క్రిష్ణ నాయక్, మాజీ సర్పంచ్ లు పడాల ప్రభాకర్, రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్త, చేవెళ్ల మాజీ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు మాసన్నగారి మాణిక్య రెడ్డి, మల్గారి శ్రీకాంత్ రెడ్డి నర్సింగ్ రావు, ప్రభు చారి తదితరులు ఉన్నారు

## పట్నం బ్రదర్స్‌కు పరామర్శ

**షాబాద్, జులై 27, ప్రభాతవార్త :** మాతృ యోగానికి గురైన పట్నం సోదరులను మాజీ ఐపీఎస్, సీనియర్ బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పరామర్శించారు. తల్లి పట్నం రుక్కమ్మ మృతి నేపథ్యంలో శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, మనుమడు షాబాద్ మాజీ జెడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి లను షాబాద్ లోని ఇంటికి చేరుకొని ఆమె చిత్రపటా నికి పూలమాలలతో నివాళులర్పించారు.

**ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పరామర్శ..**

పట్నం మహేందర్ రెడ్డి కుటుంబాన్ని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు లు పరామర్శించారు. పట్నం మహేందర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డిల తల్లి రుక్కమ్మ మృతి చెందిన నేపథ్యంలో షాబాద్ లోని వారి నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారితో పాటు పట్నం అవినాష్ రెడ్డి, కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రుక్కమ్మ పవిత్ర ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని కోరారు. కూకట్పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, కొలన్ ప్రభాకర్ రెడ్డి, పూడూరు మాజీ జెడ్పిటిసి సత్యనారాయణ రెడ్డి, నర్సింగ్ రావు, ధర్మారెడ్డి , బాలకృష్ణారెడ్డి తదితరులు వారితో ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**కేశంపేట, జులై 27, ప్రభాతవార్త :**

కేశంపేట మండలపరిధిలోని లింగంధన గ్రామానికి చెందిన నెల్లికంటి శంకరయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి ఆర్థిక సహాయంగా లక్ష్మీ మ్మనారాయణ గౌడ్ రూ.5,000,వేలు, గ్రామ ఉపసర్పంచ్ లావణ్య-తిరుపతి రెడ్డి రూ.3,000 వేల రూపాయలను ఆర్థిక సహాయాన్ని అందించి మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆపదలో ఉన్నవారికి బి ర్ స్ నాయకులు అండగా నిలవడం అభినందనీయమని గ్రామస్తులు అన్నారు .ఈ కార్యక్రమంలో లింగంధన సర్పంచ్ నాగిళ్ల వెంకట్, తిరుపతి రెడ్డి, మధుసూదన్ గౌడ్, సుదర్శన్ గుప్త, నాగిళ్ల రామస్వామి, నాగిళ్ల కృష్ణయ్య, పంది శ్రీనివాస్ రెడ్డి, గొడుగు రాములు, నాగిళ్ల బాలయ్య, చిన్న బాలయ్య, నాగిళ్ల కృష్ణ, కానుగుల భాస్కర్, కొమ్మిరి భీమయ్య, నెల్లికంటి ఇస్తారు, మోలానా, మొగిలి లక్ష్మయ్య, సాకలి బాబు, వద్దె చంద్రయ్య, నాగిళ్ల విష్ణు, కానుగుల శీను, నాగిళ్ల అజయ్, సయ్యద్ జాంగీర్, నెల్లికంటి లక్ష్మయ్య, సత్యం గౌడ్, నాగిళ్ల చెన్నయ్య, ముత్యాల నర్సింలు, గొడుగు నరేష్, మిద్దె సతీష్, నాగిళ్ల భరత్, కుమ్మరి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## దమ్మాయిగూడలో యువకుడు అదృశ్యం

**కేసు నమోదు, దర్యాప్తు ప్రారంభం**

**జవహర్‌నగర్, జులై 27,ప్రభాత వార్త:** మల్కాజిగిరికి చెందిన ముకిత్ (20) అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసుల వివరాల ప్రకారం.. మల్కాజిగిరి ఆనంద్‌నగర్‌కు చెందిన ముకిత్ గత మూడు సంవత్సరాలుగా దమ్మాయిగూడలోని 3దీ వీల్స్ షాప్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 24న తన స్వగ్రామమైన ఆనంద్ నగర్‌కు వెళ్లిన అతను, 25న ఉదయం 9 గంటలకు తిరిగి దమ్మాయి గూడలోని షాప్‌కు వచ్చాడు.ఉదయం 11 గంటల సమయంలో షాప్ యజమాని అమరేందర్ రెడ్డి, ముకిత్ తండ్రి జిలానీకి ఫోన్ చేసి, షాప్ వద్ద ముకిత్ స్కూటీ మాత్రమే ఉందని, అతను కనిపించడం లేదని తెలిపారు. అలాగే ముకిత్ మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోందని చెప్పారు.దీంతో జిలానీ వెంటనే దమ్మాయిగూడకు చేరుకుని తన కుమారుడి కోసం బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల వద్ద గాలించినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి జిలానీ ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్,జులై 27, ప్రభాతవార్త:** విద్యుత్ తీగల కింద చెట్లకొమ్మల కత్తిరింపు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు తాత్కాలికంగా అంతరాయం కల్గుతుందని ఘట్‌కేసర్ సెక్షన్ ఏఈ పవన్‌చంద్ తెలిపారు. 11 కెవి బాలాజీనగర్ ఫీడర్ పరిధిలోని బాలాజీనగర్, గాంధీనగర్, గీతామందిర్ వెనక, జగదాంబ థియేటర్, మూడుగుళ్లు, సాయిబాబా ఆలయం, ఇడబ్ల్యుఎస్‌కాలనీ, గురుకుల్ వెనక, కొండాపూర్ ఏజీఎల్ ఫీడర్ పరిధిలోని కొండాపూర్ వ్యవసాయ పొలాలకు, మజర్‌గూడ ఏజీఎల్, మజర్‌గూడ లాంగ్‌లో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, 11 కెవి కొండాపూర్ ఫీడర్ పరిధిలోని కొండాపూర్ గ్రామపంచాయతీ కాలనీ, హనుమాన్ ఆలయం, ఎస్సీ బస్తీ, వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంతంలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 3:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు, రైతులు గమనించి ముందస్తు జాగ్రత్తలు తీసుకొని తమకు సహకరించాలని ఏఈ సూచించారు.

## మేడ్చల్ చెరువులను పరిరక్షించాలి

**మేడ్చల్, జులై 27, ప్రభాతవార్త :** మేడ్చల్ ప్రజలకు జీవనాధారంగా ఉన్న పెద్ద చెరువు, తుమ్మ చెరువులను ఆక్రమణలు, మురుగునీరు, చెత్తాచెదారం నుంచి రక్షి ంచాలని మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ డిమాండ్ చేశారు. మేడ్చల్ పట్టణంలోని చెరువులను కాపాడాలని కోరుతూ శైలజ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సోమవారం మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పాతూరి ప్రభాకర్ రెడ్డి, రూరల్ జిల్లా కోశాధికారి లవంగ శ్రీకాంత్, మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి మురళీ గుప్త, రూరల్ జిల్లా బీజెవైఎం అధ్యక్షుడు రాగం అర్జున్, జిల్లా బీజెవైఎం నాయకుడు బొజ్జ రాఘవ రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ పార్టీ ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్, ఉపాధ్యక్షుడు మైసరి రాజు, సర్వేశ్వర రెడ్డి, కార్యదర్శులు బండి విష్ణు, డీ.సాయి, సత్యనారాయణ రెడ్డి, నాయకులు దగ్గు రాజు, థాత్రిక లక్ష్మణ్, చీర్ల సత్యనారాయణ, చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, బొజ్జ వంశీ రెడ్డి, జకట బాబు రాజు, మహేష్ గౌలికర్, నాగరాజు, నరేందర్, మామిళ్ళ నర్సింగ్, అవినాష్ చారి, రతన్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## జలసిరిని విజయవంతం చేయాలి

**కందుకూరు, జులై 27, ప్రభాతవార్త :** ఎల్నినో ప్రభావం వలన నెలకొన్న వర్షాభావ పరిస్థితులను అధిగమించడానికి వీలైనంత వరకు నీటి రీఛార్జ్ వనరులను సమకూర్చుకోవాలని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ కిరణ్మయి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం వలన ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. దానివలన వర్షాలు కురవక నీటి లభ్యత తక్కువ అయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సరిత, ఇంచార్జ్ ఎం పి ఓ శ్రీధర్, టి ఏ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి జానకిరామ్, ఉప సర్పంచ్ రవి కుమార్ రెడ్డి, ఏఈఓ స్వాతి, ఐ కే బి సి సి యాదగిరి, వార్డు సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

**షాద్‌నగర్, జులై 27, ప్రభాతవార్త :**షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి ఆయన వర్ధంతి సందర్భంగా షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు, మాజీ జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, టెలిఫోన్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాల వృద్ధికి కృషి చేద్దాం

**శంకర్‌పల్లి, జులై 27, ప్రభాతవార్త :** భూగర్భ జలాల పెంపకం ప్రతి ఒక్కరు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా సీఈవో సిహెచ్ కృష్ణారెడ్డి, శంకర్ పల్లి ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ అన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మండల స్థాయి అధికారుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎలినినో ద్వారా ఏర్పడిన వర్ష బావ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టబోయే పనుల గురించి వివరించారు. అదేవిధంగా త్రాగునీరు సాగునీరు కు వాతావరణ పరిస్థితి ఇదే విధంగా ఉంటే రాబోయే కాలానికి నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందువల్ల జలసిరి కార్యక్రమంలో ప్రతి ఇంటికి నీటి కుంట ( మ్యాజిక్ సోక్ పిట్) ప్రతి ప్రభుత్వ భవన ఆవరణలో కమ్యూనిటీ సోక్ పిట్ మరియు రూఫ్ టాప్ హార్వెస్టింగ్ ప్లాంట్, ప్రతి పొలానికి ఊట కుంట ప్రతి గ్రామానికి చెరువుకుంట నిర్మించుకోవాలని సూచించారు. అదే విధంగా ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాం కు సంబంధించి పంచాయతీ కార్యదర్శులను రివ్యూ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సురేష్ బాబు, తహసీల్దార్ సురేందర్, ఎంపీఓ గిరి రాజు డిప్యూటీ ఈఈ హౌసింగ్ శైలజ వ్యవసాయ



జలసిరి కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

అధికారి చైతన్య, సహాయ ఇంజనీర్లు పంచాయతీరాజ్ ఆర్డబ్ల్యూఎస్ హౌసింగ్ ఐసిడిఎస్ సూపర్వైజర్లు పంచాయతీ కార్యదర్శులు టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# నందిగామ పోలీస్ స్టేషన్ సిపి ఆకస్మిక తనిఖీ


నందిగామ పోలీస్ స్టేషన్ సందర్శించిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి.

**నందిగామ, జులై 27, ప్రభాతవార్త :** నందిగామ పోలీస్ స్టేషన్ నుఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డా. తరుణ్ జోషి సోమవారం నందిగామ పోలీస్ స్టేషన్ ను సందర్శించి పోలీస్ స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని,సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల్లో అవగాహన కల్పించాలని, యువ కేసులను సాంకేతిక ఆధారాలతో త్వరగా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని, విజిబుల్ పోలిసింగును మరింత సమర్థవంతంగా అమలు చేసి భద్రతాభావాన్ని పెంపొందించాలని, రోడ్డు ప్రమాదాలు నివారణకు ట్రాఫిక్ నిమజ్జలను అమలు చేయాలని వారు సూచించారు. అనంతరం కన్హాశాంతివనాన్ని సందర్శించారు.ఈ కార్యక్రమంలో శాద్‌నగర్ జోన్ డీసీపీ శిరీష, శాద్‌నగర్ ఏసీపీ ఎస్. లక్ష్మీ మ్మనారాయణ, నందిగామ ఎస్‌హెచ్ఓ బి. వీరబాబు తో పాటు పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# చేవెళ్లలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభించాలి

**చేవెళ్ల, జులై 27, ప్రభాతవార్త :**చేవెళ్ల నియోజకవర్గంలో ప్రభుత్వం ప్రకటించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను వెంటనే ప్రారంభించాలని భాజపా చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షులు అత్తెల్లి అనంత్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను నియోజకవర్గ కేంద్రమైన చేవెళ్లలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ చేవెళ్ల మండల భాజపా నాయకులు సోమవారం మండల విద్యాధికా రి (ఎంఈఓ) పురన్ దాస్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన ఈ పాఠశాల ఇప్పటికీ చేవెళ్లలో ప్రారంభం కాకపోవడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేసిన హామీలను వెంటనే అమలు చేసి, ఆలస్యం చేయకుండా చేవెళ్ల నియోజకవర్గ కేంద్రమైన చేవెళ్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి విద్యా సంస్థలు గ్రామీణ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విద్య వ్యవస్థ సరిగ్గా లేక చేవెళ్ల ప్రాంతం పూర్తిగా వెనుక బాటు తనానికి గురైందన్నారు. అంతేగాకుండా చేవెళ్ల కేంద్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను ఏర్పాటు చేస్తే ఐదు మండలాలకు సెంటర్ పాయింట్ అవుతుందన్నారు. విద్యార్థుల రాకపోకలకు అన్ని ప్రాంతాల నుంచి బస్


చేవెళ్ల నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయాలని ఎంఇఓకు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

సౌకర్యం ఉందన్నారు. చేవెళ్ల ప్రాంత ప్రజల ఆకాంక్షలను తెలంగాణ ప్రభుత్వం గుర్తించి వెంటనే పాఠశాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా నాయకులు క్రిష్ణగౌడ్, చేవెళ్ల మున్సిపల్ ప్రధాన కార్యదర్శి పత్తి సత్యనారాయణ, నాగరాజు గౌడ్, చేగూరి ప్రవీణ్ రెడ్డి, సామ క్రిష్ణారెడ్డి, రామక్రిష్ణా, అల్లాడ అభిషేకర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, అశోక్, వెంకటేష్, గణేష్, జయసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఆర్థిక నేరాలు భద్రతలపై అవగాహన కల్పించిన డిసిపి

**యాచారం ,జులై 27, ప్రభాతవార్త :** ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఆర్థిక నేరాలు పై అవగాహన కలిగి ఉండాలని మహేశ్వరం డిసిపి నారాయణరెడ్డి తెలిపారు.సోమవారం యాచారం మండల పరిధిలోని సాగర్ రహదారిపై గున్ గల్ గేట్ సమీపంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ మహేశ్వరం జోన్ ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ నారాయణరెడ్డి తనిఖీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. మహిళల భద్రత, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సహాయం పొందేందుకు అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాలని, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.అలాగే, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపిలు, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని, అనుమానాస్పద కాల్స్, లింకులు సందేశాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.ఏదైనా నేరం లేద అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన


ప్రజలతో మాట్లాడుతున్న డీసీపీ నారాయణరెడ్డి

వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా సంబంధిత హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసిపి కెపివి రాజు, యాచారం ఎస్ఎస్ఓ నందీశ్వర్ రెడ్డి, ఎస్సై మధు,ఎస్సై సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల కేంద్రంలోని నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల మాజీ ఎంపిపి మల్గారి విజయభాస్కర్ రెడ్డి, చేవెళ్ళ మండల బిఆర్ఎస్ నాయకులు కడమంచి ఆనంద్, డీ ఎం చందు, పెద్దోళ్ల ప్రభాకర్

# చేవెళ్ల మున్సిపల్ 17 వార్డు కౌన్సిలర్ కృష్ణా నాయక్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి

**చేవెళ్ల, జులై 27, ప్రభాతవార్త :**

చేవెళ్ల మున్సిపల్ 17 వార్డు కౌన్సిలర్ కృష్ణా నాయక్ ను వెంటనే సస్పెండ్ చేయాలని చేవెళ్ల మాజీ ఎంపిపి మల్గారి విజయభాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర దేవాలయం ఆవరణలో సోమవారం చేవెళ్ళ మండల బిఆర్ఎస్ నాయకులు కడమంచి ఆనంద్, డీ ఎం చందు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల మాజీ ఎంపిపి మల్గారి విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల చేత ప్రజాప్రతినిధిగా ఎన్నుకోబడి ప్రజల పక్షాన నిలబడాల్సింది పోయి సభ్య సమాజం సిగ్గు పడేలా ఆసుపత్రిలో ఈయన వ్యవహార శైలి ఉందన్నారు. ఆసుపత్రిలో అర్థరాత్రి తప్ప త్రాగి కౌన్సిలర్ కృష్ణా నాయక్ చేసిన హల్ చల్ ద్వారా సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారో చెప్పాల్సిన అవసరముందని డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యక్తులకు పార్టీ టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ కళ్ళు తెరవాలన్నారు. గుండాలాగా వ్యవహరిస్తూ ఆసుపత్రిలోని సిబ్బందిని బెదిరిస్తూ సోషల్ మీడియాలో వీడియోతో హంగామా చేశారన్నారు. చేవెళ్ల మున్సిపల్ 17వ వార్డు ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని తెలిపారు. చట్టం ఎవరినీ ఉపేక్షించదని చట్ట పరంగా కూడా అతని పై పోలీసులు కేసు నమోదు చేయాలన్నారు.

రాజ్యాంగ బద్దంగా ఓ ప్రజా ప్రతినిధిగా ఎన్నిక కాబడి ప్రజల పట్ల సమాజం పట్ల అనుచితంగా వ్యవహరించిన కారణంగా కృష్ణా నాయక్ ను కౌన్సిలర్ పదవి నుండి సస్పెండ్ చేయాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు బిఆర్ఎస్ నాయకులు తెలిపారు.

కౌన్సిలర్ కృష్ణా నాయక్ ను కాంగ్రెస్ పార్టీ నుండి బేషరతుగా తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టనున్నట్లు చేవెళ్ల మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో ఊరెళ్ల వార్డు కౌన్సిలర్ దూత మల్లేష్, బిఆర్ఎస్ నాయకులు మల్కాపూర్ మాణిక్య రెడ్డి, కనకమామిడి మల్లా రెడ్డి, మల్లేష్, వంగ శ్రీధర్ రెడ్డి, వెంకటేష్, ఎర్రోని కొటాల శంకరయ్య, బాలు, చాకలి క్రిష్ణ, అత్తెల్లి భాస్కర్ రెడ్డి, పెంజర్ల అనంత రెడ్డి, దండు సత్యనారాయణ, తోలుకట్ట శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండుగ సందర్భంగా అన్ని గ్రామాల్లో ఏర్పాట్లు

**శామీర్‌పేట, జులై 27, ప్రభాతవార్త:**

రానున్న బోనాల పండుగను పురస్కరించుకుని మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి సంబంధిత అధికారులకు సూచించారు.

సోమవారం మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర సర్వసభ్య సమావేశం చైర్మన్ జాము రవి అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా చైర్మన్ జాము రవి మాట్లాడుతూ మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని అన్ని వార్డులలో (గ్రామాల్లో) బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకోవటానికి ఏర్పాట్లు చేయాలని, కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. వీధి దీపాలు ఏర్పాటు, త్రాగునీటి సరఫరా, పారిశుద్యం, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సౌకర్యంలు ఏర్పాట్లు ప్రత్యేకంగా చూడాలన్నారు. ఆలయాల పరిసరాల్లో ప్రత్యేకంగా విద్యుత్ సౌకర్యాలు, పారిశుద్ధ్య పనులు సీరియల్ బల్బుల ఏర్పాట్లు, మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు చేపట్టాలని చైర్మన్ జాము రవి అధికారులకు సూచించారు. బోనాల పండుగ సందర్భంగా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ వెంకటగోపాల్, వైస్‌చైర్మన్ శశిరేఖ, పలువురు కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**..అంటువ్యాధుల బారిన పడకుండ చర్యలు**

వర్షాకాలంతో ప్రజలకు అంటు వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశంను కమిషనర్ వెంకటగోపాల్‌తో కలిసి సమీక్షించారు.

ప్రజలు కూడ అంటు వ్యాధుల బారిన పడకుండా పరిశుభ్రత పాటించాలని ఇళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వలు లేకుండా చూడాలని ఆయన సూచించారు.

దోమల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు త్రాగునీటిని కూడ వేడి చేసుకుని త్రాగాలని సూచించారు.

అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్యకేంద్రాలకు వెళ్లాలని సూచించారు ప్రతి ఇంటి నుంచి వచ్చే తడి చెత్త, పొడిచెత్త, హానికర చెత్తను విడివిడిగా వేరు చేసి మున్సిపల్ పారిశుద్య సిబ్బందికి సహకరించాలని కమిషనర్ వెంకటగోపాల్ సూచించారు.

ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


విత్తన మేళాలో పాల్గొన్న రైతులు

## దుద్యాల్‌లో విత్తన మేళా..

**ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన**

**దుద్యాల్, జులై 27, ప్రభాతవార్త:** దుద్యాల్ మండల రైతు వేదికలో సోమవారం విత్తన మేళా నిర్వహించి, ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న నాణ్యమైన విత్తనాల ప్రదర్శనతో పాటు రైతులకు సాంకేతిక అవగాహన కల్పించారు. భూసారం, వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తగిన విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలని అధికారులు సూచించారు.

అనంతరం నిర్వహించిన ఎల్‌నినో అవగాహన కార్యక్రమంలో వర్షాభావ పరిస్థితుల్లో అనుసరించాల్సిన వ్యవసాయ నిర్వహణ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నేల తేమ సంరక్షణ, నీటి యాజమాన్యంపై రైతులకు వివరించారు. తక్కువ నీటితో అధిక దిగుబడులు అందించే ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే సమతుల్య ఎరువుల వినియోగం, నేల పరీక్షలు, సేంద్రియ ఎరువుల వినియోగం, వర్షపు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తులసి, ఉద్యానవన శాఖ అధికారి సురేంద్రనాథ్, వ్యవసాయ విస్తరణ అధికారులు కావ్య, బాబు, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్లు, రైతులు పాల్గొన్నారు.


నందిగామ పురవీధ వెంచర్‌లో మొక్కలు నాటుతున్న సర్పంచ్ తదితరులు.

## నందిగామలో వన మహోత్సవం

**నందిగామ, జులై 27, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రం లోని పురవిధ పది శాతం భూముల్లో సోమవారం సర్పంచ్ కొమ్ము కృష్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వై వి రాజు, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఏఎంసి డైరెక్టర్ నర్సింలు,వార్డు సభ్యులు అగ్గి మమత సూరి, చించేటి లత శివకుమార్ గౌడ్, బొమ్మగళ్ళ నర్సింలు, గంగిశెట్టి సరిత మురళి, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కేశమోని రామచంద్రి, నాయకులు రహమత్ అలీ, గంగిశెట్టి రాజు, పూర్ణం శ్రీకాంత్, సంపత్ తదితరులు ఉన్నారు.

## పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ సీఐగా జగన్నాథ్

**ఘట్‌కేసర్ రూరల్, జులై 27, ప్రభాత వార్త:** మేడ్చల్ మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలోని పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి. జగన్నాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన సీఐగా బాధ్యతలు స్వీకరించినట్లు పోలీసులు తెలిపారు. 2009 బ్యాచ్‌కి చెందిన ఆయన గతంలో మల్కాజ్‌గిరి పోలీస్‌స్టేషన్‌లో డీఐగా పనిచేసి బదిలీపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌కు సీఐగా వచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది నూతన సీఐకి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

## చెన్నాపురం చౌరస్తాలో గుంతల పూడ్చివేత

**ట్రాఫిక్ సీఐ శివశంకర్ చొరవ**

**జవహర్‌నగర్, జులై 27,ప్రభాత వార్త:**ఇటీవలి వర్షాల కారణంగా జవహర్‌నగర్ పరిధిలోని చెన్నాపురం చౌరస్తా వద్ద రహదారిపై ఏర్పడిన గుంతలను ట్రాఫిక్ సీఐ శివశంకర్ చొరవతో డిస్మెంటల్ మట్టితో పూడ్చివేశారు. గుంతల వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వెంటనే చర్యలు చేపట్టారు.ఈ పనులను స్వయంగా పర్యవేక్షి ంచిన సీఐ శివశంకర్ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ స్పందించారని స్థానికులు తెలిపారు. వర్షాకాలంలో రహదారిని తాత్కాలికంగా మరమ్మతు చేయడంతో వాహనదారులకు ఇబ్బందులు తగ్గాయని, సీఐ శివశంకర్ చొరవ అభినందనీయమని స్థానికులు, ప్రయాణికులు ప్రశంసించారు.



## ఓటు కోల్పోకుండా ఫారంతో నమోదు చేసుకోవాలి

**ఘట్‌కేసర్, జులై 27, ప్రభాతవార్త:** సర్ ప్రక్రియలో ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారం తప్పకుండా బిఎల్‌ఓకు అందజేయాలని మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ అన్నారు. ఈసందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఎల్ఏ, బిఎల్‌ఓలు కలిసి సమన్వయం చేసుకుని ప్రజలకు సర్ ప్రక్రియ పై అవగాహన కల్పించాలని అర్హులైన ప్రతి ఓటరు తన ఓటు హక్కును కాపాడుకునేందుకు సర్ ప్రక్రియలో తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా నమోదు చేసే విధంగా చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు నానావత్ రూప్‌సింగ్‌నాయక్, మాజీ ఉపసర్పంచులు పైళ్ల మంజుల, నాయకులు పైళ్ల జంగారెడ్డి, పూస రమేష్ తదితరులు పాల్గొన్నారు.


చిన్నచిన్న తప్పులను ఎత్తిచూపే బి ఆర్ ఎస్ నాయకులకు సమస్య ఎప్పటి నుంచి ఉందో గుర్తుంచుకొని మాట్లాడాలి.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చేకూర్త గోపాల్ రెడ్డి

**శంకర్‌పల్లి, జులై 27, ప్రభాతవార్త :** చిన్న చిన్న తప్పులను ఎత్తిచూపే బి ఆర్ ఎస్ నాయకులకు సమస్య ఎప్పటి నుంచి ఉందో గుర్తుంచుకొని నిరసనలు, ధర్నాలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చేకూర్త గోపాల్ రెడ్డి, శంకర్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి లు అన్నారు. సోమవారం శంకర్ పల్లి మున్సిపాలిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిధులు విడుదలై పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రోడ్ల వద్ద ఆదివారం బి ఆర్ ఎస్ నాయకులు చేసిన ధర్నాను వారు తప్పు పట్టారు. అభివృద్ధి జరుగుతున్న సమయంలో ఆందోళన చేసి తాము అభివృద్ధి చేశామని చెప్పుకోవడం బి ఆర్ ఎస్ నాయకులకు అలవాటైందని దుయ్యబట్టారు. నియోజకవర్గంలో 300 కోట్ల రూపాయలతో రోడ్లను అభివృద్ధి చేసే కార్యక్రమం జరుగుతున్నదని తెలిపారు. ఆదివారం ఆందోళన చేసిన రోడ్డుకు కిలోమీటర్కు కోటి రూపాయల చొప్పున 40 కోట్ల రూపాయలతో ప్రత్యేక ప్రాజెక్టు కింద కేటాయించబడ్డాయని గుర్తు చేశారు. ఆ పనులు టెండర్ దశలో ఉందని చెప్పారు.

పదేళ్ల కాలంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో చేసిందని తెలిపారు. ధరణి తీసుకొచ్చి రైతులను ఇబ్బంది పాలు చేశారని ఆరోపించారు. హెచ్ఎండిఏ నిధులతో మండలంలోని పలు రోడ్లు, మునిసిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సహకారంతో జరుగుతున్నాయని తెలిపారు. రూ. 75 లక్షలతో బీడీఎల్ ప్రధాన చౌరస్తా సుందరీకరణ జరిగిందని, వీటి ప్రారంభోత్సవం మంత్రి శ్రీధర్ బాబుతో చేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మడపతి చంద్రమౌళి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రకాష్ గుప్తా, స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, నాయకులు శేరి అనంతరెడ్డి, గోపాల్, జూలకంటి పాండురంగారెడ్డి, పార్శి బాలకృష్ణ, ప్రశాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పోచారం డివిజన్ రాజీవ్ గృహకల్ప కాలనీలో సర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు రాజేశ్ తదితరులు.

## సర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన కాంగ్రెస్ నాయకులు

**ఘట్‌కేసర్ రూరల్, జూలై 27, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీ, చౌదరిగూడలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ పర్యటించి సర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు బూత్‌ల వారిగా బీఎల్‌ఓలతో కలిసి పర్యటించి ఓటర్లకు సహాయం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సర్ ఇంఛార్జీ జి. కాంతం, డివిజన్ మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బూత్ ఇంఛార్జీలు ఆంజనేయులు గౌడ్, భోజిరెడ్డి, పసులాది నర్సింగ్‌రావు ముదిరాజ్, బీఎన్. రెడ్డి, కొంతం శంకర్ రెడ్డి, ఎం. బాస్కర్ రెడ్డి, కె. వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లెడు చౌదరిగూడ,జూలై 27, ప్రభాత వార్త:** వీబీజీ రాంజీ పథకంలో భాగంగా ప్రభుత్వం కల్పిస్తున్న 100 శాతం సబ్సిడీలను చిన్న సన్న కారు రైతులు సద్వినియోగం చేసుకొవాలని జిల్లేడు చౌదరిగూడెం మండల వ్యవసాయ అధికారి రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలం లోని చింతకుంట తండా గ్రామపంచాయతీలో సర్పం చ్ దేవీ రామ్ చరణ్ ఆధ్వర్యంలో జలసిరి కార్యక్రమం పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ ఇన్చార్జ్ మండల వ్యవసాయ అధికారి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆరు రకాల ఇంకుడు గుంతలకు ప్రభుత్వం 100 శాతం సబ్సిడి అందిస్తున్నట్లు వాటి వివరాలను ప్రొజెక్టర్లో చూపించారు. 5 ఎకరాల లోపు భూమి కలిగి ఉన్న రైతులు నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవలన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రతి రైతు నీటిని ఒడిసి పట్టుకునే నీటి నిలువలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంకుడు గుంత 6500 రూపాయల నుంచి వివిధ రకాల నిర్మాణాలకు రూ.4 లక్షల వరకు సబ్బిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంకుడు గుంత నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుగుతాయని, బోరు బావుల్లో నీరు తగ్గకుండా ఉంటుందని వివరించారు. వర్షం నీరును ఒడిసి పట్టడం ద్వారా నీటి సమస్య రాదని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు ఆధారంగా ప్రతి ఒక్కరు నీటిని సంరక్షి ంచు కోకపోతే నేటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు ఈ కార్యక్రమంలో ఏపిఎం హరి నాయక్, రమేష్, టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మారెడ్డి , నవీన్, పంచాయితీ కార్యదర్శి రాజ్ కుమార్, అంగన్వాడీ టీచర్లు, వసంత, సోనా, ఉప సర్పంచ్ గబ్రు,వార్డు సభ్యులు పెంట్య నాయక్, వినోద్ నాయక్, రెడ్యానాయక్,గోవింద్, బాల్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రోజెక్టర్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, అధికారులు

## మేడ్చల్ సిఐ అంజిరెడ్డిని సన్మానించిన బిజెపి నాయకులు

**మేడ్చల్, జూలై 27, ప్రభాతవార్త :** మేడ్చల్ సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అంజిరెడ్డిని మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పాతూరి ప్రభాకర్ రెడ్డి,రూరల్ జిల్లా బిజెపి కోశాధికారి లవంగ శ్రీకాంత్, మేడ్చల్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, ఉపాధ్యక్షుడు సర్వేశ్వర రెడ్డి, బీజేవైఎం జిల్లా నాయకుడు బొజ్జ రాఘవ రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కార్యదర్శులు సత్యనారాయణ రెడ్డి,



మేడ్చల్ సీఐ అంజిరెడ్డిని కలిసిన బిజెపి నాయకులు

సాయి, విష్ణు, నాయకులు దగ్గు రాజు, అనిల్, నాగరాజు, నరేందర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జాన్ సాహెబు**

**కందుకూరు, జూలై 27, ప్రభాతవార్త :** పశువులు అత్యవసర సమయంలో జబ్బు పడినప్పుడు రైతులు 1962 నెంబర్ కు ఫోన్ చేస్తే పశు వైద్యం అందించే అంబులెన్స్ సిబ్బంది పశువుల వద్దకు వచ్చి ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జాన్ సాహెబు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో పశు వైద్య సేవలను విస్తరించడానికి ప్రభుత్వం వినూత్నమైన కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. సంచార వైద్యశాల అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని రైతులు 1962 నెంబర్ కు డయల్ చేస్తే అంబులెన్స్ వైద్య సిబ్బంది సదర్ రైతు వద్ద ఉన్న పశువుకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని ఈ అవకాశాన్ని రైతులు పశు సంరక్షకులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సంచార అంబులెన్స్‌లో డాక్టర్‌తో పాటు హెల్త్ అసిస్టెంట్ మరియు హెల్పర్ అంబులెన్స్ డ్రైవర్ ఉంటారని ఉచితంగా మందులను అందిస్తా రని వైద్య సేవలను అందిస్తారని తెలిపారు. పశువులు జబ్బుపడిన సమయంలో రైతులు 1962 కు ఫోన్ చేస్తే పసి వైద్య బృందం పశువు వద్ద వైద్య సేవలు అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశం దుర్వినియోగం కాకుండా రైతులు జాగ్రత్త వహించాలని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబులెన్స్ కార్యనిర్వాహక జిల్లా అధికారి శ్రీహరి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ జాన్ సాహెబు పాల్గొన్నారు.

## దమ్మాయిగూడలో మహిళ అదృశ్యం

**భర్త ఫిర్యాదుతో కేసు నమోదు**

**జవహర్‌నగర్,జూలై 27,ప్రభాత వార్త:**దమ్మాయిగూడ ఇంద్రమ్మ కాలనీ ఫేజ్ 2కు చెందిన స్వాతి (30) అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసుల వివరాల ప్రకారం. స్వాతి గత కొంతకాలంగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తోంది. ఈ వ్యవహారానికి సంబంధించిన లెక్కల విషయంలో భార్యాభర్తల మధ్య విభేదాలు ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే కొంత బంగారాన్ని తాకట్టు పెట్టిన విషయమూ కుటుంబంలో చర్చకు వచ్చినట్లు సమాచారం.ఈ నేపథ్యంలో ఈ నెల 26న స్వాతి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె భర్త నరేష్ బంధువులు, స్నేహితులు, తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు.దీంతో నరేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## ప్రమాదవశాత్తు లారీ బోల్తా -డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

**యాలాల జూలై 27,ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు లారీ బోల్తా పడింది.ఈ దుర్ఘటనలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.ఈ సంఘటన యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది.యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి…తాండూరు నుంచి కోడంగల్ వైపు ఇటుక లోడ్‌తో వెళుతున్న లారీ తిమ్మాయిపల్లి పరిధిలో అదుపు తప్పి బోల్తా పడింది.ఈ దుర్ఘటనలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.బోల్తా పడిన లారీ క్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కు పోవడంతో గమనించిన గ్రామస్తులు డ్రైవర్‌ను బయటకు తీసి కాపాడారు.చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తిన్నట్లు ఎస్ఐ తెలిపారు.

# విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**-చేవెళ్ల మండల వ్యవసాయ అధికారి శంకర్ లాల్**

**చేవెళ్ల, జూలై 27, ప్రభాతవార్త :** విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల మండల వ్యవసాయ అధికారి శంకర్ లాల్ సూచించారు. సోమవారం చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులకనుగుణంగా పండే పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలనుసారం ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా వివిధ రకాల పంటల సాకుకు సబంధించిన విత్తనాలను రైతు వేదిక ఉంచామని తెలిపారు. అనువైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు ఆయన తెలిపారు.

మూడు రోజులపాటు చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని చేవెళ్ల రైతు వేదికలో విత్తన మేళాను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ విత్తన మేళాలో తక్కువ నీటితో పాటు తక్కువ కాలపరిమితితో సాగుకు అనువైన కందులు, పెసర, మినుములు, ఆముదాలు వంటి రకాలైన కూరగాయ విత్తనాలు అందుబాటులో ఉంటాయని సూచించారు. చేవెళ్ల మండల రైతులు విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాకుకు ఆసక్తి ఉన్న రైతులు విత్తనాలను తీసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలన్నారు



27సివిఎల్04-చేవెళ్ల రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా

# పాఠశాల బస్సులను తనిఖీ చేసిన పోలీసులు

**జిల్లెడు చౌదరిగూడ,జూలై 27, ప్రభాత వార్త:** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో సోమవారం ధక్ష ప్రైవేటు పాఠశాల బస్సులను పోలీసులు, ఆర్‌టిఎ అధికారులు తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబందల ప్రకారం పాఠశాల బస్సులను నడపాలను యాజమాన్యానికి సూచించారు. బస్సులో డ్రైవర్‌తో పాటు ఒక హెల్పర్ కూడ ఉండాలని పెర్కొన్నారు. బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థుల పట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విజయ్‌కుమార్‌తో పాటు అధికారులు ఉన్నారు.



పాఠశాల బస్సును తనిఖీ చేస్తున్న పోలీసులు

# కలాం ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి

**ఘట్‌కేసర్, జూలై 27, ప్రభాతవార్త:** కుల, మత, ప్రాంతాలకు అతీతంగా దేశ సేవే పరమావధిగా జీవించిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు-మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లో సోమవారం భారత మాజీ రాష్ట్రపతి-భారతరత్న స్వర్గీయ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. ఈసందర్బంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు-మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డితో పాటు స్థానిక నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్బంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశాభివృద్ధికి జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత శాస్త్రవేత్త, ఆదర్శ రాష్ట్రపతి అని కొనియాడారు. భారతదేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రపంచానికి పరిచయం చేయడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. యువత పెద్ద కలలు కనాలని, ఆకలలను సాధించేందుకు కృషి కలాం ఇచ్చిన సందేశం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కలాం మహనీయుడి సేవలను దేశం ఎన్నటికీ మరచిపోదని, ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారానే నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని అన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు బండారు పవన్ రెడ్డి, ఏనుగు మచ్చేందర్‌రెడ్డి, కన్నెబోయిన రాముయాదవ్, హరీష్‌యాదవ్, ఏనుగు రఘురాంరెడ్డి, జీహెచ్‌ఎంసి బీసీ సంఘం ఉపాధ్యక్షులు- అఖిలభారత రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మరాజు సతీష్‌కుమార్, కాసుల వెంకటేష్ గౌడ్, పెద్దొళ్ల సాయిలు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



**షాద్‌నగర్ లో..**

**షాద్‌నగర్, జూలై 27, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి ఆయన వర్ధంతి సందర్భంగా షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు, మాజీ జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, చందులాల్, కత్తి చంద్రశేఖర్, అప్ప మహమూద్, ముబారక్ అలీ ఖాన్, భాస్కర్ గౌడ్, జయప్రకాష్, నందిగామ శేఖర్, షఫీదిన్, శ్రీహరి గౌడ్, బాబు నాయక్, శ్రీనివాస్, మాధవ్ యాదవ్, జగదీష్, సాజిద్, టీజేఏసీ నేతలు జనార్ధన్, టెలిఫోన్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# మిస్సైల్‌మ్యాన్ అబ్దుల్‌కలాం

**ఘట్‌కేసర్, జూలై 27, ప్రభాతవార్త:** శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశానికి మాజీ రాష్ట్రపతి-మిస్సైల్‌మ్యాన్ అబ్దుల్‌కలాం అందించిన సేవలు మరువలేనివని మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్ పవర్‌గ్రిడ్ సమీపంలోని వైఎస్ఆర్ కార్యాలయంలో సోమవారం స్వర్గీయ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామల అమరేందర్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా మహేశ్‌గౌడ్‌తో పాటు స్థానిక నాయకులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వేముల మహేష్ గౌడ్ మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం గారు దేశాభివృద్ధికి జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత శాస్త్రవేత్త, ఆదర్శ రాష్ట్రపతి అని కొనియాడారు. భారతదేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రపంచానికి పరిచయం చేయడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచులు నానావత్ రూప్ సింగ్‌నాయక్, వేముల మమతగౌడ్, సొసైటీ మాజీ డైరక్టర్లు గాయరు విశ్వనాథం, కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచులు వేముల సత్తయ్య గౌడ్, వేముల పరమేష్ గౌడ్, కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు వేముల రాజుగౌడ్, మాజీ వార్డు సభ్యులు గుర్జకుంట నర్సింహా, మెట్టు రమేష్, వేముల శంకర్‌గౌడ్, నానావత్ సురేష్‌నాయక్, బర్ల అనిత, మాజీకోఆప్షన్ సభ్యురాలు పైళ్ల లతరెడ్డి, నాయకులు పైళ్ల జంగారెడ్డి, పూస రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పవర్‌గ్రిడ్ సమీపంలో అబ్దుల్‌కలాంకు నివాళులు అర్పిస్తున్న మహేశ్‌గౌడ్, అమరేందర్ తదితరులు

## సమిష్టి కృషితో సమస్యలు పరిష్కరించుకుందాం

**-సర్పంచుల సంఘం అధ్యక్షులు సిహెచ్ శివయ్య**

**యాలాల, జూలై 27,ప్రభాతవార్త :** సమిష్టి కృషితో సమస్యలను పరిష్కరించుకుందామని యాలాల మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సిహెచ్ శివయ్య పేర్కొన్నారు.మండలంలో నూతన సర్పంచుల సంఘం ఆవిర్భావం అనంతరం మండల కేంద్రంలో సోమవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగ నూతన కార్యవర్గాన్ని ఆయా గ్రామ పంచాయతీ సర్పంచులు,ఉప సర్పంచులు నూతన కార్యవర్గాన్ని పూలదండలు,శాలువాలతో ఘనంగా సన్మానించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షులు శివయ్య మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని ఆయన సూచించారు.ఏ సర్పంచుకు సమస్య ఎదురైనా అందరం కలిసి కట్టుగా ముందుండి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు.కేంద్ర-రాష్ట్రాలు విడుదల చేసే నిధులను గ్రామాల అభివృద్ధి,ప్రజా సంక్షేమానికి వినియోగించడంలో పారదర్శకత పాటించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని శివయ్య కోరారు.తద్వార గ్రామాల అభివృద్ధి సాధ్యమై ప్రజా విశ్వాసాన్ని పొందినవారము అవుతామని ఆయన అభిప్రాయపడ్డారు.ఎంపిడిఒ శ్రీనిజ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచులకు తనవంతు సహాయ సహకారాలుంటాయని భరోసా ఇచ్చారు.సర్పంచులు రాజకీయాల కతీతంగా సంఘంగా ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు.సమిష్టితో అన్నీ సాధించుకోవచ్చున్నారు.ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులతో పాటు ఎంఇఒ మహిపాల్‌రెడ్డి,ఎస్ఐ విఠల్‌రెడ్డి,మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్ యాదవ్,వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు,సర్పంచుల భర్తలు,మండల పరిషత్ సూపరిండెండెంట్ కృష్ణారావు,తదితరులు పాల్గొన్నారు.

## యాలాలలో 80 శాతం సర్ ప్రక్రియ పూర్తి



కోకట్ పంచాయతీలో సర్ ప్రక్రియపై గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

**యాలాల జూలై 27,ప్రభాతవార్త :** యాలాల మండలంలో సుమారు 80 శాతం సర్ ప్రక్రియ పూర్తయ్యిందని యాలాల మండల తహశీల్దార్ గాయత్రి వెల్లడించారు.ఎస్ఐఆర్ పట్ల ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహారించరాదని ఆమె సూచించారు.యాలాల మండలంలోని కోకట్ గ్రామంలో సర్పంచ్ రాజేందర్‌రెడ్డితో కలిసి సోమవారం గ్రామ సభ నిర్వహించారు.ఈ సమావేశంలో తహశీల్దార్ గాయత్రి మాట్లాడుతూ ప్రజలు తమ ఎన్యూమరేషన్ పత్రాలను(ఫారం)లను పూర్తి చేసి బిఎల్ఒలకు అందజేయాలని సూచించారు.ఇప్పటికే బిఎల్ఒలు గ్రామంలో చనిపోయినవారు,శాశ్వతంగా వలస వెళ్లినవారు,డబుల్ ఓటర్లను గుర్తించే పనిలో ఉన్నారని ఆమె తెలిఇపారు.ఎన్యూమరేషన్ పత్రాలు అందనివారిని గుర్తించి పత్రాలు అందేలా ఆయా పార్టీల బిఎల్ఎలు,వార్డు సభ్యులు,సర్పంచులు కృషి చేయాలని ఆమె సూచించారు.తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది సర్ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకొని సెలు దినాల్లో కూడా విధులు నిర్వర్తిస్తున్నారని గాయత్రి పేర్కొన్నారు.తద్వారా మండలంలోని అన్ని గ్రామాల్లో 80 శాతం సర్ ప్రక్రియ పూర్తి కావొస్తోందని ఆమె తెలిపారు.కాస్త మందకొడిగా కొనసాగుతున్న రాజీవన గృహకల్ప,ఇందిరమ్మ కాలనీల్లో కౌన్సిలర్‌తో సమన్వయం ఏర్పరుచుకొని వేగం పుంజుకునేలా చర్యలు తీసుకున్నామని తహశీల్దార్ చెప్పుకొచ్చారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుధాకర్,జిపిఒ సంధ్యారాణి ,వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఇసి నిర్ణయించిన గడువులోగా సర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

## మాజీ ఎంపీ లక్ష్మీబాయి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

**ఘట్‌కేసర్, జూలై 27, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో మాజీ మంత్రి సంగం లక్ష్మీబాయి విగ్రహాన్ని తప్పకుండా ఏర్పాటు చేస్తామని బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యులు-మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ శివారెడ్డిగూడ పాపన్న చౌరస్తాలో సోమవారం మాజీ మంత్రి స్వర్గీయ సంగం లక్ష్మీబాయి జయంతిని నిర్వహించారు. సంగం వెంకటేశ్వర్లుయాదవ్, సురేందర్ యాదవ్, భరత్‌యాదవ్ గార్ల ఆధ్వర్యంలో జరిగిన లక్ష్మీబాయి జయంతిలో మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డితో పాటు నాయకులు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఘట్‌కేసర్‌లో జన్మించిన సంగం లక్ష్మీబాయి ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా ప్రజలకు సేవలందించారని, స్వాతంత్ర్య సమరయోధురాలైన సంగం లక్ష్మీబాయి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మహిళా సాధికారత, దేశభక్తి, సమాజ సేవలో ఆమె చూపిన ఆదర్శం నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఘట్‌కేసర్ ప్రాంతానికి చెందిన గొప్ప వ్యక్తిత్వం అయిన సంగం లక్ష్మీబాయి విగ్రహాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఘట్‌కేసర్‌లో ఏర్పాటు చేసేలా కృషి చేస్తామని ఆయన ప్రకటించారు. ఇందుకోసం ఘట్‌కేసర్ ప్రాంత నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాలు, యువతతో పాటు కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, సామాజిక వేత్తలు పిట్టల శ్రీశైలం, సందుపట్ల జీవన్ రెడ్డి, నాయకులు బండారు పవన్ రెడ్డి, కన్నబోయిన రాముయాదవ్, హరీష్ యాదవ్, కొమ్మిడి విక్రాంత్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు అనిల్ గౌడ్, బీసీ సంఘం జిహెచ్‌ఎంసి ఉపాధ్యక్షులు కొమ్మరాజు సతీష్ కుమార్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, మణిదీప్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చనిపోవడం బాధాకరం

**- క్యాండిల్ ర్యాలీతో విద్యార్థులకు నివాళి**

**అత్తాపూర్ జూలై 27, ప్రభాతవార్త :**

నీట్ పేపర్ లీకేజీ కారణంగా 21 మంది విద్యార్థులు చనిపోవడం బాధకరమని పుస్తకాల నర్సింగ్ రావు మరియు మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి పేర్కొన్నారు .సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాజేంద్రనగర్ మండల సమితి అఖిలభారత యువజన సమైక్య,అఖిలభా రతన విద్యార్థి సమైక్య ,భారత జాతీయ మహిళా సమైక్య ,మండల సమితి ఆధ్వర్యంలో కన్యగారి నర్సింహ్మారెడ్డి మండ ల కార్యదర్శి అధ్యక్షతన నీట్ లీకేజీ ఆత్మహత్య పాల్పడిన విద్యార్థులకు సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యులు పుస్తకాల నర్సిం గ్ రావు నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ..కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయడం విద్యార్థుల ఉద్యమం, ప్రజాస్వామ్యం గెలిచింది. నీట్ పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు జే ఆనంద్ గౌడ్ మండల సహాయ కార్యదర్శి జే విజయనంద్ గౌడ్ కుల ప్రముఖులు పసుపుల జయరాం పసుపుల సుదర్శన్ మరియు భారత జాతీయ మహిళా సమాఖ్య మండల అధ్యక్ష కార్యదర్శులు కన్నగారి లక్ష్మి మునీశ్వరి తిగిగేది మండల అధ్యక్ష కార్యదర్శు లు ఎండి సలీం సయ్యద్ కాజా మండల కార్యాలయం కార్య దర్శి జి సత్యం సిపిఐ శాఖ కార్యదర్శులు సి హెచ్ నర్సిరెడ్డి కృష్ణ లింగారెడ్డి రాంరెడ్డి జె సదానంద గౌడ్ పాండు సాబీర్ హుస్సేన్ భాయ్ శ్రీరాములు వాణి త్రీ నాయకులు రాణి నవీన్ ప్రభాకర్ మహిళా సమైక్య నాయకులు మోనిక జ్యోతి సునీత ఊర్మిళ బుజ్జి జిలాని కైలాసమ్మ గంగారం నాగార్జున చారి తదితరులు పాల్గొన్నారు .

## రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ ఆమోదం

**- జిల్లా అటవీ శాఖాధికారిని కలిసిన మండల నాయకులు**

**చౌడపూర్ ,జూలై 27, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని కొత్తపల్లి నుండి కన్మన్ కల్వ, మల్కాపూర్ నుండి వీరాపూర్ గ్రామాలకు రోడ్లు మంజూరయ్యాయని,రోడ్ల పనుల ప్రారంభించేందుకు అవసరమైన అటవీ శాఖ అనుమతులు వచ్చాయని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చొరవతో వికారాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి విశాల్ బాటులకు కలిసి, రోడ్ల నిర్మాణం ప్రాముఖ్యత గురించి వివరించామని, ఆయా గ్రామాల ప్రజల రవాణా సౌకర్యానికి కావలసిన అనుమతులు ఇవ్వాలని అధికారిని కోరినట్లు తెలిపారు.. ప్రజల రవాణా సౌకర్యాల మెరుగుదలకు సహకరించిన అనుమతులు ఇచ్చిన అటవీ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, సోమవారం మండల నాయకులతో కలిసి జిల్లా అధికారి విశాల్ కు కలిసారు. రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అన్నారు..ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఉమేష్ కుమార్ , ఉమ్మడి మండల పి.ఎ.సి.ఎస్. వైస్ చైర్మన్ అశోక్ కుమార్ , కొత్తపల్లి రామవేందర్ , మన్యం , మల్కాపూర్ రామాంజనేయులు , ఆత్మ కమిటీ డైరెక్టర్ రాజేందర్ రెడ్డి , రామకృష్ణ రెడ్డి, ఉపసర్పంచ్ గోపాల్, మరికల్ సత్యకుమార్, కన్మన్‌కల్వ రాజు , పిఏసిఎస్ డైరెక్టర్ చెన్నయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బైకు ఢీకొని వృద్ధుడు మృతి

**చౌడపూర్ , జూలై 27, ప్రభాతవార్త :**

వేగంగా వచ్చిన బైకు ఢీ కొని వృద్ధుడు మృతి చెందిన ఘటన చౌడపూర్,వీరాపూర్ రహదారిలో చోటు చేసుకుంది.ఆదివారం రాత్రి మల్కపూర్ గ్రామానికి చెందిన కొస్గి వీరప్ప(66) తండ్రి రామయ్య , చౌడాపూర్ నుండి మల్కాపూర్ గ్రామానికి కాలినడకన వెల్తుండగా, వెనక నుండి వేగంగా వచ్చిన బైకు ఢీకొట్టడంతో వృద్ధుడు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని, ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనాన్ని వీరాపూర్ గ్రామానికి చెందిన యాదయ్య నడుపుతున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని ఎస్.ఐ. రమేష్ కుమార్ తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృత దేహాన్ని స్వాధీనం చేసుకొని,పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్.రమేష్ తెలిపారు.

## వర్షాలు కురవాలని వరుణ యాగం

**షాద్‌నగర్, జూలై 27, ప్రభాతవార్త :** సకాలంలో వర్షాలు కురిసి, ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు సోమవారం జానంపేటలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో వరుణ యాగాన్ని ప్రారంభించారు.ప్రకృతి ప్రకోపం కారణంగా కాలం దాటిపోతున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు, ప్రజలు తాగునీరు, సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బక్కని నర్సింహులు తెలిపారు.

## మైనర్ బాలుడు హత్య కేసులో ముగ్గురు అరెస్ట్

**చార్మినార్,జూలై 27, ప్రభాతవార్త :**

మైనర్ బాలుడు హత్య కేసులో ముగ్గురు నింధితులను కామాటిపుర పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఫలక్‌నుమా ఏసిపి ఎంఎ జావిద్ కథనం ప్రకా రం.....పాతబస్తీ బిర్యానీషా టేకిరి ప్రాంతానికి చెందిన ఫైజ్ మహమ్మద్ అలియాస్ ఆజాన్ (17) అనే మైనర్ బాలుడిని ఈ నెల 19వ తేదీ రాత్రి 2.30 గంటల సమయంలో మహమూద్ అబ్రార్, మమమూద్ ఇస్మాయిల్ అలియాస్ ఫర్హత్, మహమూద్ అష్ఫాక్‌లు కలిసి హత్య చేశారు.పరారీలో ఉన్న ముగ్గురు నింధుతులను కాలాఫత్తర్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసిరిమాండ్‌కు తరలించారు. నింధితులు వద్ద నుంచి హత్య చేయాటానికి ఉపయో గించిన రెండు వేట కత్తులు,మూడు మొబైల్ సెల్‌ఫోన్లు, యాక్టివ్ స్కూటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు .కాగా కేసును విజయవంతంగా చేధించినందుకు కాలాఫత్తర్ పోలీస్ స్టేషన్ సిఐ మహ్మద్ ఖలీల్ పాషా,ఎస్ఐ బి.శివకుమార్ రెడ్డి,కానిస్టేబుళ్లను ఫలక్ నుమా ఏసిపి ఎంఎ జావిద్ అభినందించారు.

## షాద్‌నగర్ చౌరస్తా విస్తరణ షురూ..

**షాద్‌నగర్, జూలై 27, ప్రభాతవార్త :** షాద్‌నగర్ చౌరస్తా విస్తరణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆర్డీవో సరిత, ఏసీపీ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, మండల తహసిల్దార్ నాగయ్య, సిఐ సీతారాం ఆధ్వర్యంలో అధికారులు, పోలీసులు కలిసి విస్తరణ పనులను చేపట్టారు. మున్సిపల్, పోలీసు, రెవెన్యూ, విద్యుత్తు, ఆర్ అండ్ బి తదితర శాఖలకు చెందిన అధికారులు ఈ కూల్చివేతల కార్యక్రమంలో పాల్గొంటున్నారు. స్థానిక పరిగి రోడ్డులోని పోచమ్మ ఆలయం నుంచి విస్తరణ పనులను ప్రారంభించారు. జేసీబీల సహాయంతో రోడ్డుకు ఇరువైపులా 50 అడుగుల పరిధిలో ఉన్న ఆక్రమణలను తొలగించే ప్రక్రియను అధికారులు చేపట్టారు.

## ఆర్అండ్‌బి డిఇఇగా స్వప్నలత బాధ్యతలు

**షాద్‌నగర్, జూలై 27, ప్రభాతవార్త :** షాద్‌నగర్ ఆర్అండ్‌బీ (రోడ్లు, భవనాల) శాఖ డీఈఈగా ఇటీవల బదిలీపై వచ్చిన ఏ. స్వప్నలత సోమవారం షాద్‌నగర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఇటీవల బదిలీపై షాద్‌నగర్‌కు వచ్చిన డీఈఈ ఏ. స్వప్నలత గతంలో హైదరాబాద్, ఎర్రమంజిల్ ప్రధాన కార్యాలయం ఆర్అండ్‌బీ శాఖలో వివిధ హోదాల్లో సేవలు అందించారు. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో రహదారులు, వంతెనలు, ఇతర ఆర్అండ్‌బీ అభివృద్ధి పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

## జలసిరిపై ప్రజలకు అవగాహన

**తలకొండపల్లి ,జులై 27, ప్రభాతవార్త:** ప్రస్తుతం ఎలిమినో ప్రభావం సందర్భంగా నీటి నిల్వ లభ్యతపై ప్రజలందరికీ గ్రామసభల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తలకొండపల్లి ఎంపీడీవో సీతారామమ్మ తెలిపారు. సోమవారం నాడు తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహిం చిన గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షపాతం తగ్గిన నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను రైతులను అప్రమత్తం చేయడం కోసం ముందస్తు చర్యలు చేపట్ట నున్నట్లు తెలిపారు. ప్రజలందరూ తమ ఇంటి సమీపంలోని వాకిలలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులందరూ కాంపోండ్ ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు . ఎల్ ని నో ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకొని ఎల్ నీ నో బారి నుండి బయటపడాలని ఆమె సూచన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఎంపీడీవో సీతారామమ్మ, ఉప సర్పంచ్ అంగన్వాడి టీచర్లు ఏఈఓ లు బి ఎల్ వోలు బిఎల్ఎలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామమ్మ

## మృతుని కుటుంబానికి బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న బిజెపి నాయక్

**తలకొండపల్లి ,జులై 27, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన బండి బిక్షమయ్య అనారోగ్యాని కి గురై ఇటీవల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బిజెపి జిల్లా కార్యదర్శి శానమోని పాండు ప్రసాద్ మృదని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారికి వ్యక్తిగతంగా 50 కేజీల బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు పోతువండి మహేష్ సీనియర్ నాయకులు బండి యాదయ్య బండి శాంతకుమారి శీను బండి రాములు పాండు తదితరులు పాల్గొన్నారు.

## జర్మనీ టెక్నాలజీతో వాటర్ ట్యాంకు శుభ్రత



వాటర్ ట్యాంకు క్లీన్ చేస్తున్న గ్రామస్తులు

**తలకొండపల్లి ,జులై 27, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని ఫుల్ సింగ్ తండాలో జర్మన్ టెక్నాలజీ తో వాటర్ ట్యాంక్ ను శుభ్రపరచినట్లు గ్రామ సర్పంచ్ రమేష్ నాయక్ తెలిపారు. జర్మనీ టెక్నాలజీ ద్వారా ఓవరేడ్ వాటర్ ట్యాంక్ ను శుభ్రపరచి గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి సహకారంతో జర్మనీ టెక్నాలజీని వినియోగంలోకి తీసుకొచ్చి వాటర్ ట్యాంకులు సుప్రపరుస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ ను పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి

**తలకొండపల్లి ,జులై 27, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఎస్ఐఆర్ ప్రక్రియను సోమవారం నాడు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. తలకొండపల్లి మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో 36, 37 బూతులలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ఓటర్స్ జాబితా సవరణ కొత్త ఓటర్ నమోదు ఓటర్ వివరాలు మార్పులు దరఖాస్తుల స్వీకరణ తదితర కార్యక్రమాలను పరిశీలించి ఓటర్ల జాబితాను త్వరితగతిన పూర్తిచేయాలని బిఎల్ఓ బిఎల్ఏలకు సూచన చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అను గుణంగా అర్హులైన ప్రతి ఓటర్కి ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐఆర్ను పారదర్శకంగా వేగవంతం చేయాలన్నారు. గ్రామ ప్రజలం దరికీ అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరు ఓటును నమోదు చేసుకునేందుకు వీలుగా ప్రజలకు విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్ గ్రామ సర్పంచ్ అనిత శ్రీనివాస్ ఉపసర్పంచ్ గోపాల్ వార్డు సభ్యులు రాజేందర్ నాయక్ రఘునారెడ్డి ప్రవీణ్ బాల్రాజ్ కాంగ్రెస్ నాయకులు రమేష్ యాదవ్ భగవాన్ రెడ్డి డేవిడ్ నరసింహారెడ్డి జంగయ్య గ్రామస్తులు తదితరులు పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్ గ్రామ సర్పంచ్ అనిత శ్రీనివాస్ ఉపసర్పంచ్ గోపాల్ వార్డు సభ్యులు రాజేందర్ నాయక్ రఘునారెడ్డి ప్రవీణ్ బాల్రాజ్ కాంగ్రెస్ నాయకులు రమేష్ యాదవ్ భగవాన్ రెడ్డి డేవిడ్ నరసింహారెడ్డి జంగయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తలకొండపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులు విద్యార్థులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**తలకొండపల్లి ,జులై 27, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన పిట్టల పోశయ్య అనే అనారోగ్యానికి గురై మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ భైరపాక జంగమ్మ బాలస్వామి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి 3000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భైరపాగా జంగమ్మ భాగస్వామి గుడ్డల వెంకటయ్య జంబల వెంకటయ్య కాటమన్ శీను గౌరి లక్ష్మయ్య గొర్రె రాములు గుర్రం కోటయ్య కేసీఆర్ యుగంధర్ గొర్రె శీను బండ శీను తో పాటు బి ఆర్ ఎస్ కార్యకర్తలు గుడ్డల వెంకటయ్య జంబల వెంకటయ్య కాటమన్ శీను గౌరి లక్ష్మయ్య గొర్రె రాములు గుర్రం కోటయ్య కేసీఆర్ యుగంధర్ గొర్రె శీను బండ శీను తో పాటు బి ఆర్ ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

## వృద్ధురాలి మెడలో పుస్తెల తాడు లాక్కెళ్లిన దొంగ..

**పేట్ బషీరాబాద్, జులై 27, ప్రభాతవార్త**

పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుచిత్ర సెంటర్, హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో చైన్ స్నాచింగ్ ఘటన చోటుచేసుకుంది. వెంకాయమ్మ (75) అనే వృద్ధురాలు శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో పూజలు ముగించుకుని ఇంటికి వస్తుండగా, ఇంటి ముందు గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ని పుస్తెల తాడును లాక్కొని పరారయ్యేందుకు ప్రయత్నిం చాడు.వృద్ధురాలి అరుపులు విన్న స్థానికులు వెంటనే అప్రమ త్తమై దుండగుడిని వెంబడించారు. ఒక వ్యక్తి ధైర్యంగా అతడిని పట్టుకుని తన ద్విచక్ర వాహనంపై పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. అయితే మార్గమధ్యంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం నెమ్మదించగానే దుండగుడు దూకి మళ్లీ పారిపో యాడు.సమాచారం అందుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు వెంటనే గాలింపు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నా రు. అతడి వద్ద నుంచి వృద్ధురాలి బంగారు పుస్తెల తాడును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# కూరగాయల ఏజెన్సీపై ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న తాళ్ళ రవిందర్

**ఆమనగల్లు, జులై27, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని కూరగాయల ఏజెన్సీ నిర్వహణపై (మోండ) స్థానిక మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ళ రవిందర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణిలో రవిందర్ రాతపూర్వక ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆమనగల్లు పట్టణంలో దశాబ్దకాలంగా కొంతమంది కూరగాయల ఏజెన్సీ ని అక్రమ మార్గంలో దళారుల పాత్రతో నిర్వహిస్తూ రైతులను మోసం చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆరుగాలం పండించిన కూరగాయలను అమ్ముకుందామని వచ్చే రైతులను ఏజెన్సీలు మోసం చేస్తుండడంతో ఆర్థిక నష్టాలు లోనవుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా ట్రేడ్, కమిషన్ లైసెన్సు లేకుండా ఏజెన్సీ నిర్వాహకులు వేలంపాట ద్వారా 30శాతం పైగా అధిక శాతం మొత్తంతో కమిషన్ తీసుకుంటూ రైతులను మోసం చేస్తు న్నారన్నారన్నారు. రైతులను దగా చేస్తున్న మోండాపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

# మార్కెట్ అభివృద్ధి నిధుల ఏర్పాటుకు కృషి చేయాలి

**మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులు**

**ఆమనగల్లు, జులై27, ప్రభాతవార్త:** మార్కెట్ అభివృద్ధి నిధుల ఏర్పాటుకు కృషి చేయాలని మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులు అన్నారు.సోమవారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న మార్కెట్ కమిటి కార్యాలయ పనులను ఎఏంసి డిఈ విష్ణువర్ధన్‌తో కలిసి పరిశీలించారు.అనంతరం రూ. మూడు కోట్ల కవర్ షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఏంసి సిబ్బంది తదితరులు పాలొన్నారు.



నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేస్తున్న చైర్మన్

# అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయండి

**-సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**శంషాబాద్ జులై 27, ప్రభాతవార్త :** అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటలోకి తీసుకురావాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.సోమవారం శంషాబాద్ మండల కార్యాలయంలో భివృద్ధి పనులపై ప్రత్యేక ప్రగతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో మండల వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, మరియు మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ అమలింగం గౌడ్,ఎంపిడివో మున్నీ, వివిధ శాఖల ఉన్నతాధికారులు, గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఆర్ ఫౌండేషన్ గుడికి బడికి సహకారం

**యాచారం, జులై 27, ప్రభాతవార్త:**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో గుడికి బడికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని బి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రామ్ రెడ్డి తెలిపారు. బి ఆర్ ఆర్ వ్యవస్థాపక అధ్యక్షులు బూడిద రాంరెడ్డిని హైదారాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలసిన నక్కర్త మేడిపల్లి గ్రామస్తులు సోమవారం కలిశారు. జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల కు సమావేశ ప్రాంగణంలోని వేదిక నిర్మాణం, నక్కర్త హనుమాన్ దేవాలయం కు ఆర్థిక సహాయం కోసం కలవగా దేవాలయంకు 500 బస్తాల సిమెంట్ ఇస్తాను అని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాల కు సమావేశం వేదిక నిర్మాణం కోసం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాజీ వార్డు సభ్యులు దేంది సురేందర్ రెడ్డి, దేవాలయం కమిటీ చైర్మన్ సింధం అంజయ్య, వైస్ చైర్మన్ బండ రాజు, కలకండ అంజయ్యా, పి ఆర్ జి ఫౌండేషన్ అధ్యక్షులు రవీందర్ గుప్త, బనే శ్రీశైలం, సింధం శ్రీశైలం,జాల అయిలేష్, పాఠశాల పి ఆర్ సిరాజు , కొంగల యాదగిరి , రాంరెడ్డి,మంగ అయిలేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ సమగ్ర సవరణని వేగవంతం చేయాలి

**మోటే శ్రీశైలం**

**యాచారం, జులై 27, ప్రభాతవార్త:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రజలు అధికారులు సమయంతో పనిచేసి వేగవంతంగా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోటి శ్రీశైలం పిలుపునిచ్చారు. సోమవారం ఇబ్రహీంపట్నం మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా యాచారం మండలంలోని నల్లవెల్లి గ్రామంలోని 9,10,11 బూత్ లను సందర్శించిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోటె శ్రీశైలంగ్రామ బి ఎల్ ఓ లు పంచాయతీ కార్యదర్శి పుష్పలత , అంగన్వాడి సిబ్బంది జ్యోతి, యాదమ్మ, వివిధ బూత్ లలో ఎమ్యూనరేషన్ ఫారాలు నింపి ఇచ్చిన వారి వివరాలు తెలుసుకున్నారు.9 వ బూత్ లో87 ,10 వ బూత్ లో 83 11 వ బూత్ లో 89 మంది ఎమ్యూనరేషన్



నల్లవెల్లిలో ఓటర్ సమగ్ర సవరణ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కిషన్ నాయక్ హోటల్ శ్రీశైలం కార్యకర్తలు

ఫారాలు నింపారని బి ఎల్ ఓ లు లు తెలిపారు.మండల అధ్యక్షులు శ్రీశైలం మిగతా వారి వివరాలు సాధ్యమైనంత తొందర పూర్తి చేయాలని కోరారు. వారితో పాటు స్థానిక సర్పంచ్ కిషన్ నాయక్,మాజీ ఎంపీటీసీ లక్ష్మీ మ్రపతి గౌడ్,సూపర్ వైజర్ గొరిగే హరికిషన్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పాశం జయప్రకాష్,సూపర్ వైజర్లు చీర శేఖర్,కోరే జగదీష్ నాయిని శ్రీకాంత్, బి ఎల్ ఏ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లిలో జలసిరిపై అవగాహన

**యాచారం, జులై 27, ప్రభాతవార్త:**

యాచారం మండల పరిధిలోని మేడిపల్లి నక్కర్త గ్రామపంచాయతీలో గల సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ ఆధ్వర్యంలో రైతువేదిక భవనం లో జల సిరి ఫామ్ పాండ్స్ ,పంట కుంటల పైన గ్రామ సభ నిర్వహించారు. జరిగింది. గ్రామసభ అనంతరం గ్రామంలో మొక్కలు నాటడం కార్యక్రమం నిర్వహించారు.ఈ సమావేశానికి ఎంపిడివో రాధ రాణి పంచాయతీ సెక్రెటరీ శ్రీలత, డైరెక్టర్ మక్కపల్లి స్వరూప శ్రీనివాస్,గ్రామ వార్డు సభ్యులు ఆడాల శ్రీకాంత్, ఎరుకల జ్యోతి, అండెకార్ అనిల్, బూరే కలమ్మ, ఆలంపల్లి మహేష్, వంగూరి మనోహర, కలకొండ పద్మ, ముచ్చర్ల సంపత్, వంగూరు జంగయ్య, నలొల్ల చంద్రయ్య తదితరులు హాజరైయ్యారు.

# జీవో 641 రద్దు చేయాల్సిందే

**-సిద్దాపూర్ డంపింగ్ యార్డుపై జేఏసీ సమరశంఖం**

**-చెరువులు.. కుంటలు.. భూగర్భ జలాలను కాపాడుకుందాం**

**-డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం**

**-ప్రజల పక్షాన జేఏసీ పోరాటానికి సంపూర్ణ మద్దతు**

**: మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**

**కొత్తూరు, జులై 27, ప్రభాతవార్త:**

కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏర్పాటైన సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (టియు జెఏసి)ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన తొలి సమావేశం విజయవంతమైంది. జేఏసీ చైర్మన్ రాంబాల్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, సీపీఐతో పాటు కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

**ప్రజల కోసం చేసే ప్రతి పోరాటంలో మీ వెంటే ఉంటా: అంజయ్య యాదవ్**

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తూ పరిశ్రమల కోసం భూములను కేటాయిస్తే, ప్రస్తుత ప్రభుత్వం అదే ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం దారుణమన్నారు. డంపింగ్ యార్డు ఏర్పాటుతో సిద్దాపూర్ పరిసర ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, భూగర్భ జలాలు కలుషితమై ప్రజల జీవనం తీవ్రంగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉందన్నారు.ప్రజల కోసం ప్రజా సంఘాలు, జేఏసీ నాయకులు చేపట్టే ప్రతి కార్యక్రమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, డంపింగ్ యార్డు రద్దయ్యే వరకు ప్రజల పోరాటంలో తాను ముందుండి నడుస్తానని అంజయ్య యాదవ్ స్పష్టం చేశారు. ఈ పోరాటంలో విజయం సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.

**ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకొస్తాం: ఎమ్మె సత్యనారాయణ**

సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాటంలో కీలకంగా వ్యవహరిస్తున్న జేఏసీ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు వల్ల కలిగే దుష్ప్రభావాలను గ్రామ ప్రజలకు వివరించి, ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి ఐక్య పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకొని జీవో నంబర్ 641 రద్దు చేసే వరకు ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు డంపింగ్ యార్డు వల్ల పర్యావరణం, భూగర్భ జలాలు, ప్రజల ఆరోగ్యంపై పడే ప్రభావాలను వివరించారు. జేఏసీ ఇచ్చే ప్రతి పిలుపులో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జేఏసీ రూపొందించిన వాల్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ రాంబాల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, సలహాదారులు వంగూరి గంగిరెడ్డి, అబ్దుల్ రబ్ జామి, రాజవరప్రసాద్, కోచైర్మన్లు దొడ్డి శ్రీనివాస్, ఎమ్మె సత్యనారాయణ, బొజ్జా శ్రీనివాస్ రెడ్డి, వడ్డె బాలయ్య, రజిత నాయక్, బుద్దల జంగయ్య, ఈశ్వర్ నాయక్, రవీంద్రనాథ్, టి.జి. శ్రీనివాస్, అర్జున్, శ్రీకాంత్, ఆకాశ్ నాయక్, పెంటనోళ్ల నర్సింహ, బచ్యా నాయక్ తదితరులతో పాటు రాజకీయ పార్టీల నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లెల వెంకట్ రెడ్డి, ఈట గణేష్, వంకాయల నారాయణ రెడ్డి, కొస్గి శ్రీనివాస్, దేవేందర్ యాదవ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## ప్రత్యేక సవరణ ప్రక్రియను పూర్తి చేయాలి : సర్పంచ్ గోపాల్

**పూడూరు, జులై 27, ప్రభాతవార్త :** త్వరితగతిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని సర్పంచ్ గోపాల్,ఉప సర్పంచ్ మొర్రి బందయ్య పేర్కొన్నారు. సోమవారం పూడూరు మండలం మిట్టకంకల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బిఎల్ఓ సుమిత్రతో కలిసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్ 2026) ఎలిమినేషన్ ఫామ్స్ వెరిఫికేషన్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఎస్‌డి లిస్టును తయారు చేసి సన్నద్ధంగా ఉండాలని వివరించారు.దూరప్రాంతాల్లో ఉన్న ఓటర్లను గుర్తించి పూర్తి సమాచారం తీసుకోవాలని సూచించారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ,ఫారాల నిర్వాహణ,ఇంటింటి సర్వే,అర్హులైన ఓటర్ల నమోదు,తొలగింపులు,ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై సమగ్రంగా ప్రతి ఒక్కరికి అవగామన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు శ్రీనివాస్,యాదయ్య,మాణిక్యం,సత్యయ్య,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం 125వ వార్షికోత్సవ గ్రంథంలో రచనలకు ఆహ్వానం

**నాంపల్లి, జులై 27, ప్రభాతవార్త :**

సుప్రసిద్ధ సాహితీ సంస్థ శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం 125వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మరొక సాహితీ సాంస్కృతిక సంస్థ యువభారతి సం యుక్త నిర్వహణలో ఒక ప్రత్యేక తెలుగు సాహిత్య సంక లన గ్రంథాన్ని ముద్రించాలని నిర్ణయించినట్లు ఒక ప్రకట నలో పేర్కొన్నారు. ఇందులో మీకు నచ్చిన ప్రక్రియలో వ్రాయండని తెలుగు కవులకు, కవయిత్రులకు సువరా ్ణవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. నియమ నిబంధనలు తెలుపుతూ : 1. విషయం; నాకు నచ్చిన నా తెలుగు; 2. ఏమివ్రాయాలి : తెలుగుభాషా ఔన్నత్యాన్ని కీర్తిస్తూ లేదా తెలుగు సాహిత్యంలోని కావ్యాలు/ ఇతర ప్రక్రియల విశేషాలను విశ్లేషిస్తూ తెలుగు పద్య, గేయ, వచన కవితల రూపంలో ఏదైనా ఒక ప్రక్రియలో ముద్రణలో సుమారు 30 పంక్తులు మించకుండా రచించి, తెలుగులో టైపుచేసి పంపాలి. ఎంపికైన ఉత్తమ రచనలకు ప్రథమ బహుమతి 5వేలు; ద్వితీయ బహుమతి 3వేలు; తృతీయ బహుమతి 2వేలు; ప్రోత్సాహక బహుమతులు (3) ఒక్కొక్కటి వెయ్యి రూపాయలు. 3. వయోపరిమితి : 40ఏళ్లలోపు యువతీ యువకులు పాల్గొనవచ్చు. 4. ఎలాంటి ప్రవేశ రుసుము లేదు. 5. ఏమేమి పంపాలి : రచనతోపాటు మీ స్వీయపరిచయాన్ని, పాస్‌పోర్టు సైజు ఫోటోను, మొబైల్ నంబరు, ఇ-మెయిల్ అడ్రసు, చిరు నామా వివరాలను తెలియజేస్తూ ఈ రచన మీ స్వం తమేనని, శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం, యువభారతి సంయుక్త నిర్వహణలో ప్రచురించబోయే గ్రంథం కోసం ప్రత్యేకంగా రచించబడినది, వేరే ఎక్కడా ప్రచురింపబడలేదని ఒక హామీపత్రాన్ని జతపరచాలి. 6. రచనలను శ్రీ కృష్ణదేవరాయ తెలుగు భాషానియలం, 4-4-8, సుల్తాన్‌బజార్, హైదరాబాద్-500001 చిరునామాకు పంపాలి. 7. తెలుగులో టైపు చేయబడ్డ రచనను పిడిఎఫ్ రూపంలో ఎస్‌కెటిబిఎన్. ఓఆర్‌జిఎట్ దరేట్‌జీమెయిల్.కాంకి పంపవచ్చు. మరిన్ని వివరాలకు ఉదయవర్లు : 9885686415; ఆచార్య ఫణీంద్ర : 9959882963లలో సంప్రదించవచ్చును. 8. పూర్తి వివరాలతో పాటు మీ రచనలు చేరవలసిన ఆఖరు తేదీ : ఆగస్టు 15, 2026. ఎంపికైన 125 రచనలు ఉన్న గ్రంథం 2026 సెప్టెంబరు నెలలో జరగనున్న శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషానిలయం 125వ వార్షికోత్సవ సభలో ఆవిష్కరించబడుతుందని వెల్లడించారు.



ఆమనగల్లులో మేళాలో విత్తనాలు ప్రదర్శిస్తున్న వ్యవసాయాధికారులు

## రైతులకు అందుబాటులో విత్తనాలు

**ఆమనగల్లు, జులై27, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణం లోని రైతు వేదికలో మూడురోజులపాటు విత్తన మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జులై 27 నుండి 29 వరకు విత్తన మేళా నిర్వహించి కందులు, పెసర, మినుము, ఆముదాలు, కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు ఆయన వివరించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం తక్కువ నీటి వినియోగం కలిగిన విత్తనాలు అందించి రైతులకు మద్దతుగా నిలబడాలనే సంకల్పంతో విత్తనమేళ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరి సాగు చేసే రైతులు ప్రత్యా మ్నాయ సాగుకు ఆసక్తి చూపాలని కోరారు. ఈ కార్య క్రమంలో ఏఈఓలు నిఖిత, మీనాక్షి, రైతులు మరియు డీలర్స్ పాల్గొన్నారు.

## ఎల్‌నినో అత్యవసర పంటలే మేలు

**కుల్కచర్ల,జులై27, ప్రభాతవార్త:** ఎల్‌నినో వల్ల వర్షపాతం తగ్గి, భూగర్భ జలాలు పడిపోయే ముప్పు ఉన్నందున, ఎక్కువ నీరు అవసరమయ్యే వరి వంటి పంటలకు బదులుగా తక్కువ నీటితో,తక్కువ కాలంలో పండే ఆరుతడి మరియు కరువును తట్టుకునే ప్రత్యామ్నాయ అత్యవసర పంటలను రైతులు వేసుకోవాలని వ్యవసాయ శాఖ శాస్త్రవేతలు రాజేశ్వర్ రెడ్డి,టిఆర్‌వీకె ,పార్గి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో స్థానిక నాయకులతో, రైతులతో కలిసి అత్యవసర పంటలపై ప్రణాళిక అవగాహన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ భీంరెడ్డి, ఏఎంసి చైర్మన్ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీమండల అధ్యక్షులు గోపాల్ నాయక్ అయ గ్రామాల సర్పంచ్‌లు, రైతులు తదితదరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియపై నిర్లక్ష్యం చేయొద్దు

**ఆర్ఐ రవింద్రచారి**

**కుల్కచర్ల,జులై27, ప్రభాతవార్త:** ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ కచ్చితంగా సర్ ఫామ్‌ను నింపాల్సిందేనన్ని ఆర్ఐ రవిందచారి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కామునిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ రవింద్రచారి మాట్లాడుతూ.. ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ కచ్చితంగా సర్ ఫామ్‌ను నింపాల్సిందేనని మాట్లాడుతూ దూరం ప్రాంతాలలో ఉన్న ప్రజలు సమయం తీసుకుని ప్రభుత్వం చేపట్టిన సర్ ప్రక్రియలో పాల్గొని ఫామ్‌ను నింపి అప్పుజప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యమ్మ వెంకటేష్,ఉప సర్పచ్ న్యార్య నాయక్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్న సబితా గోవర్ధన్ రెడ్డి



ఉత్తమ సర్పంచ్ అవార్డును మీదుగా అందుకుంటున్న సర్పంచ్ అమీర్పేట సబితా గోవర్ధన్ రెడ్డి.

**షాబాద్, జులై 27, ప్రభాతవార్త :** గ్రామాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, మల్లారెడ్డిగూడ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న షాబాద్ మండలం మల్లా రెడ్డిగూడ గ్రామ సర్పంచ్ అమీర్పేట సబితా గోవర్ధన్ రెడ్డికి బహుజన సాహిత్య అకాడమీ ఉత్తమ సర్పంచ్ అవార్డు లభించింది

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా సబితా గోవర్ధన్ రెడ్డి ఈ అవార్డును నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం అందుకున్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన విశిష్ట సేవలను గుర్తిస్తూ బహుజన సాహిత్య అకాడమీ ఈ అవార్డును ప్రదానం చేసింది.

ఈ కార్యక్రమంలో ఆర్టీఐ కమిషనర్ భూపాల్, మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ పాల్గొని సబితా గోవర్ధన్ రెడ్డిని అభినందించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తమ్మలి రమేష్, మల్లారెడ్డిగూడ గ్రామ ఉపసర్పంచ్ మాణిక్యం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొల్తూర్‌లో ఆలయ నిర్మాణం కోసం విరాళం

**..ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం**

**..మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి**

**శామీర్‌పేట, జులై 27, ప్రభాతవార్త:**

కొల్తూర్ గ్రామంలో నిర్మిస్తున్న మాతమ్మ ఆలయ నిర్మాణం కోసం మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి ఆర్థిక సహాయంగా 51వేల రూపాయలు విరాళంగ నిర్వాహకులకు అందజేశారు. సోమవారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని కొల్తూర్ గ్రామంలో ఆలయ నిర్మాణం కోసం నిర్వాహకులకు విరాళంగా ఆర్థిక సహాయంను చైర్మన్ జాము రవి అందజేశారు. ఆలయంలో పూజలు చేసిన చైర్మన్ జాము రవి ఆలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి కావాలని ఆశీర్వాదం ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎం.శశిరేఖ, కౌన్సిలర్లు గిరిపల్లి రమేశ్, గుండ్లపల్లి మహేశ్వరి,విష్ణువర్ధన్‌రెడ్డి, అజయ్‌కుమార్, కె.రాజు, నాయకులు స్వామి, కృష్ణ, సత్తయ్య, కిష్టయ్య, నర్సింలు, గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు చైర్మన్ జాము రవికి దన్యవాదాలు తెలియజేశారు.



## ఆమనగల్లు ఎస్సైగా సంతోష్‌రెడ్డి

**ఆమనగల్లు,జులై27, ప్రభాతవార్త:** ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సంతోష్‌రెడ్డి సోమవారం పదవిబాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సబ్‌ఇన్‌స్పెక్టర్ బదిలీపై వెళ్ళారు. చేవేళ్ళ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై సంతోష్‌రెడ్డి ఇక్కడికి విచ్చేసారు. ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వర్లు సమక్షంలో సంతోష్‌రెడ్డి పదవిబాధ్యతలు స్వీకరించారు. కాగా ఈసందర్భంగా సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.